

9న పార్వతీపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పాచిపెంట

ఈనెల 9న పార్వతీపురం ఐటిడిఎ గిరిమిత్ర సమావేశం మందిరం జాబ్‌మేళా జరుగుతుందని స్థానిక తహశీల్దార్ డి.రవి తెలిపారు. ఈ జాబ్ మేళాకు కెఎల్ గ్రూప్, అమెజాన్ సంస్థలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన యువతీ యువకులు అర్హులని తెలిపారు, అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 ఏళ్లలోపు ఉండాలని, కనీస వేతనం రూ.16 వేలు నుంచి రూ. 18 వేల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఏజెన్సీలో మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ప్రజలకు ఉచిత వైద్యం అందించే విధంగా ప్రభుత్వం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ భద్రగిరి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట గురువారం సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్ మాట్లాడుతూ ఏజెన్సీలో వచ్చే అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యమందించి, మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఏజెన్సీ అంతటా మలేరియా, టైఫాయిడ్, డెంగీ, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధులు, రక్తహీనతతో గిరిజనులు రోగాలు బారిన పడుతున్నారన్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు లేకపోవడంతో గిరిజనులకు మెరుగైన వైద్యమందడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి ఏజెన్సీ ప్రాంతంలో మెరుగైన సేవలందించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి మాట్లాడుతూ ఆసుపత్రులతో పాటు ఆశ్రమ పాఠశాలల్లోనూ విద్యార్థులకు మెరుగైన సేవలందించి మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని డిమాండ్ చేశారు. సిహెచ్‌సి లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేసి ఉన్నత వైద్యం అందించాలని, సికిల్ సెల్ఎనీమియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వమే బ్లడ్ ఏర్పాటు చేయాలని, అత్యవసర సేవల నిమిత్తం అదనంగా అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం వైద్యాధికారికి వినతి ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు తిరుపతి రావు, మోహన్ రావు, పాండు రంగా రావు, గిరిజనులు పాల్గొన్నారు.

భద్రగిరి సిహెచ్‌సి వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

సిహెచ్‌సిని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలి

కురుపాం : నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిహెచ్‌సి వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంలో కేవలం 30 పడకలు ఉండడంతో రోగులకు బెడ్‌లు చాలక అనేక ఇబ్బందులకు గురవుతూ ఒక్క బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు చొప్పున వైద్యం పొందుతున్నారన్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో గిరిజన గ్రామాల ప్రజలు ఎక్కువ మంది మలేరియా, టైఫాయిడ్, పాముకాటు తదితర వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరి వైద్యం పొందుతూ బెడ్లు చాలక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కురుపాం పరిసర ప్రాంత గ్రామాలు కూడా రావాడ రామభద్రపురం, మాదలింగి పిహెచ్‌సి పరిధిలో ఉన్నాయని, దీనివల్ల ఆ గ్రామాల ప్రజలు అనారోగ్యంతో మొదట ఆ పిహెచ్‌సికి వెళ్లి వైద్యం చేయించుకున్న తర్వాత ఇక్కడకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. కావున కురుపాం పరిధిలో గ్రామాలన్నీ ఈ సిహెచ్‌సిలోకే మార్చాలని, ప్రతి సిహెచ్‌సి, పిహెచ్‌సిలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ పరీక్షా కిట్లు, మందులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకొని ప్రజలకు వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని కోరారు. అలాగే నియోజవర్గ కేంద్రం కనుక తప్పనిసరిగా వంద పడకల ఆసుపత్రి ఉండాలని అలా అయితేనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్యమందుతుందని అన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి కురుపాం సిహెచ్‌సిని వంద పడకల ఆసుపత్రిగా మార్చి అవసరమైన భవనాలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ శోభారాణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఎం కురుపాం, జియ్యమ్మవలస మండల కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి సమస్యలను వివరిస్తున్న సిపిఎం నాయకులు గంగునాయుడు

సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సమాజంలోని విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువులు కీలకపాత్ర వహించి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక లైన్స్ క్లబ్ వద్ద జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా గురువులకు విశిష్ట గుర్తింపు నిచ్చిన మహనీయుడు సర్వేపల్లి రాధాకష్ణ అని కొనియాడారు. సర్వేపల్లి రాధాకష్ణ జన్మదినోత్సవాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని వెల్లడించారు. డైట్‌లో శిక్షణ పొంది గ్రూప్స్‌లో మంచి ర్యాంక్ సాధించి కలెక్టర్ స్థాయికి చేరుకోవడం, గురువుల మధ్య ఉపాధ్యాయుల దినోత్సవంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధవహించి బలోపేతం చేయాలన్నదే తన అభిలాష అన్నారు. సమాజానికి గురువు మార్గదర్శకులనీ, ఆ స్థానం ఎప్పటికీ పదిలంగా నిలుస్తుందన్నారు. ప్రస్తుత సాంకేతిక విప్లవ యుగంలో సాంకేతికత చేరువైనందున గురువులు అందిపుచ్చుకుని విద్యార్థుల్లోని సజనాత్మకతను, సాంకేతిక నైపుణ్యాలను వెలికతీసేందుకు దష్టిపెట్టాలని స్పష్టం చేశారు. విద్యార్థులను మంచి నడవడిక చూపించి సక్రమ మార్గంలో పయణించడంలో గురువు కృషి విలువకట్టలేమన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యా ప్రమాణాలను బోధించడంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాను విద్యా రంగంలో ప్రథమ స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కంకణం కట్టుకోవాలని పునరుద్ఘాటించారు. ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు కలెక్టర్ తెలిపారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ సష్టిలో తల్లిదండ్రులు ప్రపంచానికి పరిచయం చేస్తే గురువుగా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి , ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుంటారని అన్నారు. డిపిఆర్ఒ లోచర్ల రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనా వృత్తిని ఎంతో పవిత్రంగా భావించి విద్యార్థుల్లోని స్వీయ ఆలోచనాశక్తిని పెంపొందించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తారన్నారు. విద్య, క్రీడా రంగాల్లో విద్యార్థులు రాణించేలా ప్రత్యేక శ్రద్ధవహిస్తున్నారని చెప్పారు. జిల్లాలో ఉన్నత చదువులు చదివి అనుభజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నందున ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా భోధన అందించాలని ఆకాంక్షించారు.

అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికలను కలెక్టర్ చేతులమీదుగా అందజేశారు. అంతకుముందు ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సైన్స్, ఫోటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ తిలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బోనెల గౌరీశ్వరి, డిఇఒ గార పగడాలమ్మ, సహాయ సంచాలకులు ఎంఇ రమా జ్యోతి, సహాయ సంచాలకులు పి.సుధాకర రావు, జిల్లా సమన్వయ అధికారి ఎం.సుధాకర్, ఎంఇఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, డిఇఒ, ఎమ్మెల్యే తదితరులు

సైన్సు ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

ఉపాధ్యాయుడు పక్కి రవీంద్రనాథ్‌కు అవార్డు అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

తహశీల్దార్‌కు వినతినిస్తున్న కుడుమూరు భో పోరాట కమిటీ నాయకులు

గిరిజనులకు సాగు హక్కు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కుడుమూరు 48సర్వే లో 782 ఎకరాల ప్రభుత్వ భూముల్లో గిరిజనులకు సాగు హక్కు పట్టాలివ్వాలని ఆదివాసీ గిరిజనసంఘం, కుడుమూరు భూపోరాట కమిటీ నాయకులు సూకురు అప్పలస్వామి, జన్ని లక్ష్మణ, కె.మధు, జమ్మయ, జమ్మయ్య ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తాతల కాలం నుంచి సాగులో ఉన్న తమకు ఇంతవరకు అధికారుల చుట్టూ కాలు అరిగేలా తిరిగినా, ఎన్ని ఆందోళనలు చేసినా పట్టాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీగా తమ వద్దకు వచ్చిన ప్రస్తుత మంత్రి సంధ్యారాణి మాకు భూమి హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ ఇచ్చిన ప్రకారం తమ భూములకు రక్షణ కల్పించి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజనులు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు హక్కులు కల్పించాలని, లేకుంటే ఈ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని అన్నారు. అలాగే కుడుమూరు 48 సర్వే నెంబరులో సాగు చేస్తున్న హక్కు భూములకు పూర్తిస్థాయిలో గిరిజనులందరికీ న్యాయం చేసి పట్టాలు మంజూరు చేసి ఆ భూములకు రక్షణ కల్పించాలని కోరారు. గిరిజనులకు న్యాయం చేయకుంటే పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతని అందజేశారు. సమస్య పరిష్కారానికి తహశీల్దార్ హామీ ఇచ్చారు. సంఖ్యలో గిరిజన మహిళలు, సాగు చేస్తున్న గిరిజనులు పాల్గొన్నారు.

నేడు పాచిపెంట మండలంలో పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-పార్వతీపురం

అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో పాచిపెంట మండలంలో అన్ని పాఠశాలలకు శుక్రవారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాచిపెంట మండలం తాహశీల్దార్, మండల విద్యాశాఖ అధికారి సిఫారసుల మేరకు ఈ సెలవు ప్రకటించినట్లు ఆమె తెలిపారు.

జాబ్ మేళాకు 55మంది ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు 120 మంది నిరుద్యోగ యువత హాజరవ్వగా, 55మంది ఎంపికయ్యారు. అమెజాన్ సంస్థలో ఉద్యోగాల కోసం నిర్వహించిన ఈ జాబ్ మేళాలో కెఎల్ గ్రూప్ సంస్థ ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరైన ఐటిడిఎ ఎపిఒ చినబాబు మాట్లాడుతూ ఐటిడిఎ ద్వారా గిరిజన నిరుద్యోగ యువతకు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని, వాటిని యువత వినియోగించుకోవాలని అన్నారు. ఉద్యోగంలో వచ్చే ఒడిదుడుకులు ఎదుర్కోవాలని సూచించారు. దూర ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి వచ్చినా కష్టపడి చేసి, జీవితంలో ఎదగాలన్నారు. జాబ్ మేళాకు హాజరైన 120 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి, 55 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్ఒ ఎస్‌వి గణేష్, వెలుగు ఎపిడి ఆర్‌వి రమణ, వైటిసి మేనేజర్ వెంకటరమణ, కెఎల్ గ్రూప్ ప్రతినిధులు టి.సత్యనారాయణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వర్షం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంతో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో గురువారం వింత వాతావరణం చోటుచేసుకుంది. ఉదయం వేసవిని తలపించే తీవ్రమైన ఎండ ఎక్కడంతో గర్భిణీలు, బాలింతలు, వృద్ధులతో పాటు కురుపాం వారపు సంతకు వచ్చిన ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే మధ్యాహ్నం మూడు గంటలు అయ్యేసరికి ఆకాశం పూర్తిగా మబ్బులమయమై భారీ వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. చాలా రోజుల తర్వాత ఇంత పెద్ద వర్షం కురవడంతో ఉడిసిన వరినాట్లుకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విజృంభిస్తున్న డెంగీ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో డెంగీ కేసులు చాపకింద నీరులా వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికే ఈ ఏడాది 18 కేసులు నమోదయ్యాయి. జూన్‌లో రెండు కేసులు, జులైలో 1, ఆగస్టులో 6, ఆగస్టు 26 నుంచి నేటి వరకూ 9 డెంగీ కేసులు నమోదయ్యాయి. అయితే ఇవి అధికంగా దోమలు కుట్టడం వల్లే వస్తుందన్నారు. డెంగీ పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ఇప్పటికే సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ కేసులపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా, ఈ పది రోజుల్లో 9 డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. అయినా ఈ కేసులను ఎటువంటి రెఫరల్ చేయడం లేదని సకాలంలో వైద్యమందించి తగ్గిన తర్వాత రోగులను డిశ్చార్జ్ చేస్తున్నామని సమాధానం ఇచ్చారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజనుడు

ఆర్ఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ఆర్ఎస్ మరణం తీరని లోటు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సిపిఎం పూర్వ కార్యదర్శి, రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) మరణం అణగారిన వర్గాలతో పాటు సిపిఎంకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. అనారోగ్యంతో గురువారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మరణించిన ఆర్ఎస్‌కు స్థానిక సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కాకలు తీరిన కమ్యూనిస్టు పోరాట యోధులు సత్యనారాయణరాజు మృతికి జిల్లా పార్టీ, సంఘాల ప్రతినిధుల తరఫున తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తున్నామని అన్నారు. ఆయన మరణం ఎవరూ పూడ్చ లేనిదన్నారు. పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లాలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికుల కోసం, అట్టడుగనున్న ప్రజల కోసం జీవితాంతం కృషి చేసిన గొప్పయోధుడని కొనియాడారు. సంపన్న కుటుంబంలో పుట్టి పేదల కోసం జీవితాంతం త్యాగం చేసిన గొప్ప కమ్యూనిస్టు అని కొనియాడారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై. మన్మథరావు, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి. ఇందిరా, విద్యార్థి నాయకులు కె.రాజు, శ్రీను, అభి, జయ తదితరులు పాల్గొన్నారు.

ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

జియ్యమ్మవలస మండలం బిత్తరపాడులో కుక్కలదాడిలో మృతి చెందిన నీరస శంకరరావు కుటుంబాన్ని ఆదుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. ఈ మేరకు గురువారం ఆమె డిఆర్ఒ కేశవనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. శంకరరావు భార్యకు ఏదైనా చిరుద్యోగం ఇవ్వాలని, కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరారు. ఆమె వెంట బిత్తరపాడు సర్పంచ్ వెంకట నాయుడు, గరుగుబిల్లి మాజీ ఎంపిపి మఱ్రాపు పురుషోత్తం నాయుడు, సామాజిక చైతన్య వేదిక నాయకులు పి.రంజిత్ కుమార్ వున్నారు.

కలెక్టరేట్ వద్ద విఒఎల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

రాజకీయ వేధింపులు ఆపాలని,తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ విఒఎలు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, శ్రామిక మహిళా కన్వీనర్ వి.ఇందిర ఆధ్వర్యాన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విఒఎలు ఆందోళన చేపట్టారు. తొలుత స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మూడేళ్ల కాలపరిమితి జీవో రద్దు చేయాలని, రూ.పదివేల వేతనం చెల్లించాలని, నేరుగా విఒఎల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వెలుగు పిడి వై.సత్యం నాయుడుకు వినతిపత్రం అందజేశారు. గ్రామైక్య సంఘం ఆమోదం లేకుండా విఒఎలను ఎవరూ తొలగించలేరని చెప్పారు. మూడేళ్ల కాలపరిమితి జీవో అమలు లో లేదన్నారు. జియ్యమ్మవలస మండలం లో తొమ్మిది మంది విఒఎలను తొలగించలేదని, పని చేయించుకోవాలని చెప్పినట్లు పిడి సత్యం నాయుడు తెలిపారు. ఆందోళనలో సిఐటియు జిల్లా కార్యదర్శి జివి రమణ, సూరిబాబు, పలువురు విఒఎలు పాల్గొన్నారు.

విఒఎల కు ఉద్యోగభద్రత కల్పించాలి : ఎమ్మెల్యే కు వినతి

గుమ్మలక్ష్మీపురం : విఒఎలకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతూ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదేశ్వరికి గుమ్మలక్ష్మీ పురం క్యాంపు కార్యాలయంలో గరుగుబిల్లి మండల విఒఎలు వినతి ఇచ్చారు. గడిచిన 20ఏళ్లుగా కనీస గౌరవ వేతనం లేకుండా 2017 వరకు పనిచేశామన్నారు. అయితే గతంలో సిఎం చంద్రబాబు రూ.3000 నిర్ణంచి ఆదుకున్నారు. ఆ వేతనం ప్రస్తుతం రూ.8వేలు వస్తుందని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న ధరలకు ఇది చాలడం లేదన్నారు. తమ గ్రామాల్లో పార్టీ పెద్దలు తమను తొలగించి కొత్త వారిని నియమిస్తామని ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కావున ఎమ్మెల్యే స్పందించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా చేస్తున్న విఒఎలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సాలూరురూరల్

సాలూరు పరిధిలో గల 400 కెవి సబ్ స్టేషన్ మరమ్మతులు కారణంగా సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎపిఇపిడిఎల్ ఇఇ కె.గోపాలరావు నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాలూరు మండలంలోని ఆటోనగర్, మామిడిపల్లి, గంగన్న దొరవలస, మావూడి, పాచిపెంట మండలంలోని పాచిపెంట, గురువు నాయుడు పేట, మక్కువ మండలంలోని మక్కువ, ఎర్ర సామంతువలస సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని తెలిపారు.

జియ్యమ్మవలస : మండలంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి బి శ్రీనివాసరావు తెలిపారు. మరడాం వద్ద 400 కె.వి సబ్‌స్టేషన్ నిర్వహణ పనిపై అంతరాయం ఏర్పడుతుందని, కావున కురుపాం నియోజకవర్గంలో జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల విద్యుత్ వినియోగదారులు గమనించాలని అన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లు ప్రారంభించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధికి బ్యాంకులు ముఖ్య భూమిక పోషించాలని, అందుకుగానూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, తద్వారా స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు సహకరించాలన్నారు. పంట రుణాలు ఎక్కువ మొత్తంలో మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని చెప్పారు. బ్యాంక్ బిజినెస్ కరెస్పాండెంట్లు గ్రామాల్లో పనులు చేపట్టాలని తద్వారా గ్రామీణ ప్రాంతంలో బ్యాంక్ సేవలు బాగా అందుతాయన్నారు. ఉపాధి కల్పన యూనిట్లు ప్రారంభం కావాలని, పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. వన్ దన్ వికాస్ కేంద్రాల (వి.డి.వి.కె)ను రిజిస్ట్రేషన్ చేయించాలని ఆయన అన్నారు. సామాజిక కార్యక్రమాల్లో బ్యాంకులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో వివిధ వసతి గృహాల్లో అవసరమగు పనులు పూర్తి చేయాలన్నారు. ఇందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని సూచించారు.

20 ఫ్యాన్లు వితరణ

వివిధ వసతి గృహాల్లో ఫ్యాన్లు అవసరాన్ని గుర్తించిన కలెక్టర్ స్వయంగా ముందుకు వచ్చి సొంతంగా 20 ఫ్యాన్లు అందిస్తామని ప్రకటించారు. జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎస్ మన్మథరావు ఐదు ఫ్యాన్లు వితరణగా అందిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇందుకు ఆయనను అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి

సైబర్ నేరగాళ్లపై ఖాతాదారులను అప్రమత్తం చేయాలని, అవగాహన కలిగించాలని కలెక్టరు చెప్పారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకులకు సంబంధించిన సమాచారం, ఓటీపీలు అడగడం, లింకులు పంపించడం, బహుమతులు, లాటరీలు వచ్చాయని వివిధ రూపాల్లో నేరాలకు పాల్పడుతుంటారని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగదారులు చెప్పరాదని, ఓపెన్ చేయరాదని సూచించారు. బ్యాంకులు ఎప్పుడు ఒటిపిలు అడగటం, లింకులను షేర్ చేయడం చేయదని తెలుసుకోవాలని చెప్పారు. వీటిపై ఖాతాదారులు అవగాహన పెంచుకొని ఎటువంటి సైబరు మోసాలకు లోను కాకూడదని కోరారు సమావేశంలో నాబార్డు డిఎం డిఎస్ దినేష్ కుమార్ రెడ్డి, డిఎల్‌బి మేనేజర్ జెఎల్ఎన్ మూర్తి, సహాయ లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రత్యూష, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, కెవిఐసి డిఒ రవికుమార్, చేనేత జౌళి శాఖ అధికారి ఎన్ రమణ, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం గురువారం సిపిఎం ఆధ్వర్యాన పట్టణంలో విరాళాల సేకరణ జరిగింది. బెలగాం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు దుకాణాల యజమానుల నుంచి సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మధరావు ఆధ్వర్యంలో దాతల నుంచి రూ.5300 సేకరించారు. ఈ సొమ్మును పార్టీ పీపుల్స్ ఫండ్‌కు పంపించనున్నట్లు రెడ్డి వేణు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.ఇందిర, గొర్లి వెంకటరమణ, సూరిబాబు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్‌ను అందజేస్తున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్

పాఠశాలకు ప్రింటర్ వితరణ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ప్రింటర్ వితరణగా ప్రిన్సిపల్ వి.రామలక్ష్మికి తన వ్యక్తిగత సిబ్బంది గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది విద్యార్థులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ టి.గౌరీశంకర్, వీరేష్ చంద్రదేవ్ వ్యక్తిగత సిబ్బంది రామకృష్ణ, చంటి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంపై తప్పనిసరిగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామస్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలదేనని ఎంపిడిఒ ఎస్.ఉప్పారావు అన్నారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ఇన్చార్జి సిడిపిఒ వివి రమణమ్మ ఆధ్వర్యంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో అన్ని శాఖల సమన్వయంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి బాల్య వివాహాలు వల్ల జరిగే నష్టాలు గూర్చి తెలియజేసి బాల్యవివాహాలు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయం నుంచి పాతపేట వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.రమణమ్మ, ఇఒపిఆర్‌డి జి.రమేష్‌బాబు, సూపర్వైజర్లు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి పోషకాలపై అవగాహన కల్పించారు. శారీరక, మానసిక అభివృద్ధిలో స్థూల, సూక్ష్మ పోషకాలు, ప్రోటీన్ల క్రియ శీలకమని సిడిపిఒ శాంతి భవాని అన్నారు. ఏ ఏ పోషకాలు తీసుకొని ఆహారంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎ. శ్రీనివాసరావు, అంగన్వాడీ సహాయకులు సలీత పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

వేతనాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల రాస్తారోకో

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బకాయి వేతనం చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లు గుమ్మలక్ష్మీపురంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యం కాపాడుతున్న వారి సమస్యలు ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని సిఐటియు నాయకులు కోలక అవినాష్ అన్నారు. నెలల తరబడి వేతనాలందక కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మండంగి రమణ, తిరుపతి రావు, మోహన్ రావు, గ్రీన్ అంబాసిడర్ మండల నాయకులు మండంగి పైడయ్య పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన కెవికె బృందం

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ, ఉద్యాన పంటలపై ప్రభావం మీద రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.ధ్రువ, ఎడిఎఒ నిర్మల జ్యోతితో కలిసి కురుపాం, జియ్యమ్మ వలస మండలాల్లో పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల వల్ల వరి, పత్తి పంటల్లో ఎటువంటి ప్రభావం లేదని నిర్ధారించారు. ఇందులో భాగంగా వరిలో ఆకు ముడత పురుగు ఉనికిని గుర్తించి దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

నాటుసారాను నియంత్రించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో నాటుసారాను నియంత్రించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నాటు సారా ఏరులై పారుతోందని, పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, ఆయా గ్రామాల్లో నాటుసారా విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని, సంబంధిత శాఖ అధికారుల దాడులు తగ్గడంతో నాటు సారా అమ్మకాలు పెరిగాయన్నారు. వీటితో పాటు గంజాయి విక్రయాలు కూడా పెరిగాయన్నారు. కావున తక్షణమే అధికారులు స్పందించి వాటిని నియంత్రించాలని ఆయన కోరారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన పురస్కరించుకొని పట్టణ పరిధిలో గల పలు పాఠశాలల్లో డొక్కా సీతమ్మ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు జిల్లా కేంద్రంలో గురువారం జనసేన నాయకులు చందక అనీల్, వంగలపూడి నాని, మనేపల్లి ప్రవీణ్, రెడ్డి నాగరాజు, గుననా నరేష్, భమిడిపాటి చైతన్య, కడగల గణేష్, గేదెల వంశీ, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేతులు మీదుగా బహుమతులు స్థానిక సంస్కృత పాఠశాలలో అందజేశారు. అనంతరం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.హేమసుందర్ నాయుడు, శోభారాణి, మాట్లాడుతూ ఈ కార్యక్రమం చేసినందుకు చాలా సంతోషంగా ఉందని, ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థులు మరింత పరిణితి చెందుతారని అని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవాలు

సీతంపేటలో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, ఐటిడిఎ అధికారులు

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన 41 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు వీరిలో సూర్యనారాయణ, ఎం.భాస్కరరావును సన్మానించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ చిన్నబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, ప్రజా ప్రతినిధులు కర్నేని అప్పలనాయుడు, సవర తోటమొఖలింగం, తేజోవతి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలోఉపాధ్యాయ దినోత్సవం ప్రధానోపాధ్యాయులు పి.పద్మశ్రీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తరగతులు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులంతా కలిసి హెచ్ఎం పి.పద్మశ్రీని, సోషల్ అసిస్టెంట్ సిహెచ్ ఉషను ఉ సన్మానించారు. మండలంలో పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురుపూజోత్సవ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడును విద్యార్థులు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఉపాధ్యాయులు, వారి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాదు తదితరులు ఉన్నారు

పార్వతీపురం రూరల్ : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఉపాధ్యాయులకు విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాదాభివందనం చేయడం విశేషం. వెంకంపేట, చిన్న బండపల్లి, ఎంఆర్ నగరం గ్రామాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

వీరఘట్టం: మండలంలోని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు జి రవి ప్రసాద్, సూరు సతీష్‌ను ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కంబరవలస ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుత, పూర్వ విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు ఎం.పైడ్రాజుకు పాదాభివందనం చేశారు.

సాలూరు రూరల్ : మండలంలోని మడతనవలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అనకాపల్లి గణేష్, ఆరిసెట్టి గంగరాజు, అంగన్వాడీ కార్యకర్త బి.శాంతమ్మకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కన్నం నాయుడు, గ్రామ పెద్దలు తవుడు, తిరుపతి, చిన్న పాల్గొన్నారు. అలాగే మండలంలో అన్ని పాఠశాలల్లో విద్యార్థి, విద్యార్థులతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

సీతానగరం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శంకరరావును మండల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఘనంగా సన్మానించింది. ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు అవార్డు గ్రహీత శంకరరావును అభినందిస్తూ దుశ్శాలువాలతో సత్కరిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు పి.సత్యనారాయణ, ఎస్‌టియు అధ్యక్షులు ఎ.మోహన్‌రావు, పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శి కె.అప్పుడుదొర పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వనిజ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న అల్లు రవిప్రసాద్ కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పురస్కారం తనకు ఎంతో గౌరవాన్ని, ఆనందాన్ని తెచ్చి పెట్టిందని ఆయన అన్నారు. అలాగే ఇకపై విద్యార్థుల భవిష్యత్తు కోసం, పాఠశాల అభివద్ధికి మరింత పాటు పడతానని తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ఏకలవ్య పాఠశాలలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ నేడు ప్రపంచం అన్ని రంగాల్లో విశేష పరిజ్ఞానం కలిగి ఉందంటే అందుకు కారణం విద్య నేర్పిన గురువేనని అన్నారు. ఉత్తమ గురువులందరికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ పెంటన్న, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు,ఎంపిడిఒ సాల్మన్ రాజు, చింతలగూడ ఎయిడెడ్ పాఠశాల మేనేజర్ బేతా కష్ణమూర్తి నాయుడు , టిడిపి నాయకులు మండంగి భూషణ ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భామిని : జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్ రఘు పాత్రుని శివకుమార్, గణితం ఉపాధ్యాయులు సవర జానకీరావు ఎంపికయ్యారు. వీరు కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన వీరికి పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురులో గురుపూజోత్సవ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వి.హరగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత సర్వేపల్లి రాధాకష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు ర్పించారు. అనంతరం విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు మురపాక నాగేశ్వరరావు, విశ్రాంత గ్రంథాలయ అధికారి ఉమామహేశ్వరరావు, స్థానిక డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు చుక్క రాఘువేంద్రనాయుడును అధ్యాపక సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, ఎజిఎంఒ పైల శంకరరావు, సంతకవిటి జూనియర్ కాలేజీ ప్రిన్సిల్ జనార్ధనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : ఉత్తమ ఉపాధ్యాయుడు శంకరరావును సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో సీనియర్లకు తీవ్ర అన్యాయం : యుటిఎఫ్

వీరఘట్టం : జిల్లాలో ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో ప్రాథమిక, యుపి పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని యుటిఎఫ్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటిస్తుందని, ప్రతి మండలంలో ఎంఇఒల సిఫార్సు చేసిన పేర్లను పరిగణలోనికి తీసుకుని అందులో జిల్లా కమిటీ ఎంపిక చేసిన వారికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇస్తుంటారని వారన్నారు. ఈ ఏడాది కూడా ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే జిల్లాలోనిపలు మండలాలకు చెందిన మండల విద్యాశాఖ అధికారులు ఇచ్చిన ఉపాధ్యాయులు పేర్లు బుట్టదాఖలయ్యాయని వారు ఆరోపించారు. పలుకుబడి ఉన్న వారు ఇచ్చిన పేర్లు మాత్రమే పరిగణలోనికి తీసుకున్నట్లు విమర్శించారు. మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు పేర్లను సిఫారసు చేస్తే వీరు పేర్లు బదులు వేరే వారి పేర్లు జాబితాలో ఉన్నాయన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ఎంపికలో పైరవీలకు పెద్దపేట వేశారని వీరంతా ఆరోపించారు. కనీసం మండల స్థాయిలోనైనా సీనియర్ ఉపాధ్యాయులను ఎంఇఒలు సన్మానించకుండా సీనియర్లను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో యుటిఎఫ్ నాయకులు ఎం.పైడిరాజు, ఎస్.రాజకుమారి, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, ఎస్.విశాలాక్షి ఉన్నారు.

సాలూరు : ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసు శాఖ అనుమతులు తీసుకోవాలని పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ వి.నారాయణ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, పట్టణంలో వినాయక మండపాల ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు ఆన్లైన్లో 100 రూపాయలు చెల్లించి పోలీస్ శాఖ అనుమతులు పొందాలని, వినాయకు విగ్రహ మండపాల ఏర్పాటుకు వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్ అంతరాయం కలిగించేలా స్థలాలను ఎంచుకోరాదని, వినాయక విగ్రహాలకు నిర్వాహకులే తగిన భద్రత (24 గంటలు) కల్పించుకోవాలని సూచించారు. నలుగురికి తక్కువ కాకుండా వినాయకుని బొమ్మ రక్షణ కొరకు ఉండాలని, చందాలు పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడకూడదన్నారు. అట్టివారిపై కఠిన చర్యలు తీసుకొనబడునని, వినాయక విగ్రహాల వద్దగాని, లేదా నిమజ్జనం రోజున గానీ, ఎలాంటి డిజె సౌండ్ బాక్సులు, అశ్లీల డ్యాన్స్ ప్రోగ్రాంలు నిర్వహించరాదని, బాణాసంచా కాల్చరాదని, వినాయకుని బొమ్మలు నిమజ్జనం రోజు ట్రాఫిక్ అంతరాయం కలిగించరాదని, మైక్ ఉపయోగించే వారు పోలీస్ వారి నుంచి మైక్ పర్మిషన్ తప్పకుండా తీసుకొవాలని తెలిపారు. అలాగే మసీదు, చర్చిల సమీపాన విగ్రహ ప్రతిష్ట చేసే వారు ప్రార్ధనలు జరుగు సమయంలో సౌండు లేకుండా చూడాలని, విగ్రహాల వద్ద నిమజ్జనం ఊరేగింపు సమయంలో కొత్తవారు గానీ, అనుమానిత వస్తువులు ఉంటే వెంటనే సమీపంలోనిపోలీస్ అధికారులకు తెలిపాలన్నారు. విగ్రహాల వద్ద పూజ, ఇతర కార్యక్రమాలను రాత్రి 10 గంటల కల్లా పూర్తి చేసి ముగించాలన్నారు. విగ్రహ ఏర్పాటుకు విద్యుత్, మున్సిపల్ శాఖ అనుమతులు తీసుకోవాలి, నిమజ్జనం రోజు, ఊరేగింపునకు వాడే వాహనాలకు ముందస్తు అనుమతి తీసుకుని, వాహనాలు తనిఖీ అయిన తర్వాత ఊరేగింపు నిర్వహించాలని, వినాయక ఉత్సవ మండపాల వద్ద అగ్నిప్రమాదం జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ సూచనలను తప్పనిసరిగా పాటించి వినాయక చవితి పండుగ ఉత్సవములు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐలు గోవిందరావు, సంతోష్ కుమారి ఉన్నారు.

గుంటూరు ట్రైన్‌కు కూనేరులో హాల్ట్ ఇవ్వాలి

ప్రజాశక్తి - కొమరాడ

రాయపూర్ రైలు సమయం మార్చాలని, గుంటూరు ట్రైనును కూనేరు రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని, ఇఎంయు ట్రైన్ రాయగడ వరకు పొడిగించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుండి ఉదయం 4గంటలకు రాయపూర్ వెళ్లే ట్రైన్ వల్ల పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, వ్యాపారస్తులకు,ఉద్యోగులకు ఎంతో అనుకూలంగా ఉండేదన్నారు. ఇప్పుడు ఆ ట్రైన్ సమయం మార్చి విశాఖపట్నం నుండి కొరాపుట్ ట్రైన్‌కు రాయగడ వరకు లింక్ కలపడం వల్ల ఇప్పుడు రాయపూర్ ట్రైన్ పార్వతీపురం వచ్చేసరికి ఉదయం 10 గంటల సమయం దాటుతుందన్నారు. దీనివల్ల అనేకమంది ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, ప్రయాణికులు చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. కావున రాయపూర్ ట్రైన్ పాత సమయాన్ని పునరుద్ధరించాలని కోరారు. అలాగే అటు ఒడిశా నుంచి ఇటు ఆంధ్రాకు ఎంతో ఉపయోగకరమైన కూనేరు రైల్వే స్టేషన్లో గుంటూరు నుంచి రాయగడ వెళ్లే ట్రైన్ గడిచిన రెండున్నరేళ్లు నిలిపివేయడంతో పేదలపై చాలా ఆర్థికంగా ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. కావున గుంటూరు -రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలును కూనేరు రైల్వేస్టేషన్‌లో నిలిపివేయాలని కోరారు. లేనిచో రాబోయే రోజుల్లో గుమడ రైల్వే స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రైతును నిర్ణయాత్మక శక్తిగా మార్చేందుకే బ్యాలెట్ బాక్స్ పరీక్ష

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులకు ఎరువులు, పురుగులు, తెగుళ్ల మందులు పంటలపై వచ్చే వ్యాధుల నివారణ, మిత్ర, శత్రు పురుగులు వంటి వాటిపై ఎంత మేర అవగాహన ఉందో తెలుసుకుని వారికి 14 వారాల పొలంబడిలో వివిధ అంశాలపై అవగాహన కల్పించడమే పొలంబడి ప్రధాన ఉద్దేశమని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని పెద్ద కంచూరులో ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమంలో రైతులకు బ్యాలెట్ బాక్స్ పరీక్ష నిర్వహించారు. మళ్లీ 14 వారాల పొలంబడి పూర్తయిన తర్వాత పరీక్ష నిర్వహించి ఎంత మేర అవగాహన కలిగిందో తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముందుగా గత వారం జరిగిన కార్యక్రమాన్ని రైతు బోడయ్య వివరించారు. అనంతరం పురుగుమందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ ఈ పురుగుల మందులు మనిషి తల నుంచి పాదం వరకు ప్రతి అవయవంపై విష ప్రభావాన్ని చూపిస్తాయని, కావున ఎలాంటి విచక్షణారహిత పురుగుమందులు వాడకూడదని తెలిపారు. ముందుగా రైతులను చైతన్యపర్చేందుకు ఆట పాటలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిఎలు భారతి, కిరణ్, శతాభి, సర్పంచి రామయ్య, ప్రకృతి సేద్య ప్రతినిధులు సురేష్, విజయ్, రైతులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ

పిహెచ్‌సిని పరిశీలించిన డిడిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు గురువారం తనిఖీ చేశారు. ముందుగా పిహెచ్‌సిలో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని రికార్డులో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. చికిత్స కోసం పిహెచ్‌సికి వచ్చే ప్రతి రోగి పట్ల తక్షణమే స్పందించి వారు ఎటువంటి ప్రయాసపడకుండా తగు నిర్దేశం చేస్తూ సంతృప్తి తో తిరిగి వెళ్లేలా వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ జ్వరాలు ఏ మేరకు నమోదు అవుతున్నాయని, మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు, మందుల లభ్యత వివరాలపై వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ తనిఖీ చేశారు. రక్త,మూత్ర పరీక్షలు ఫలితాలు సకాలంలో అందజేయాలని ల్యాబ్ టెక్నీషియన్‌ను ఆదేశించారు. పాము, కుక్క కాటు ఇంజక్షన్లు, వ్యాక్సిన్ లభ్యతను పరిశీలించి మందుల కాల పరిమితిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సకాలంలో వినియోగించేలా చూడాలని ఫార్మసిస్ట్‌ను ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, నిబంధనలు అతిక్రమించినా ఆ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్, సూపర్వైజర్స్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగారంలో చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట వద్దగల ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగారం ఆవరణలో గల పవర్ ప్లాంట్ వద్ద గతనెల 31న దొంగతనం జరిగి పవర్ ప్లాంట్ వద్ద ట్రాన్స్ఫార్మర్లలో రాగివైరును ఆయిల్‌ను దొంగలించినట్లు కర్మగార హెచ్‌ఆర్ ఇన్‌ఛార్జ్ సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్ చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. కర్మాగారానికి చెందిన ఈ ప్రాంతంలో మేలో ఒకసారి సందర్శించామని, తర్వాత గతనెల 31న సందర్శించిన సమయంలో దొంగతనం జరిగినట్లు గుర్తించినట్లు కర్మాగార హెచ్‌ఆర్ ఇంచార్జి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కర్మాగారాన్ని సందర్శించి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పార్వతీపురం మండలం జిల్లా నుండి క్లూస్ టీం కూడా గురువారం దొంగతనం జరిగిన ప్రాంతాన్ని సందర్శించినట్లు ఆయన తెలిపారు.

ఆటోను బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని మామిడిపల్లి బ్రిడ్జిపై గురువారం సాయంత్రం ఆటోను బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సాలూరు నుండి వస్తున్న ఆటోను మామిడిపల్లి నుంచి ఎదురుగా బైక్‌పై వెళ్తున్న రెయ్యివాని వలసకు చెందిన కొత్తుల రవి (32) ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆయనకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికంగా ఉన్న యువకులు స్థానిక పిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా 162 నాటు సారా ప్యా కెట్లు రవాణా చేస్తూ పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై జి .కళాధర్ గురువారం తెలిపారు. పాలకొండ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం అమ్మినా, రవాణా చేసినా, తయారు చేసినా అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృద్ధురాలికి దుప్పట్లు అందజేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కొమరాడ : గురుపూజోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్, వృద్ధమిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి తన సొంత నిధులతో గురువారం అర్తాంలోని 50 మంది వృద్ధులు, దివ్యాంగులకు, మహిళలకు దుప్పట్లు (రగ్గుల), స్టీలు గ్లాసులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ కలిశెట్టి శంకరరావు, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రెసిడెంట్ పట్నాన శంకరరావు, కార్యదర్శి కట్టారపు శివ, రెడ్‌క్రాస్ సభ్యులు బోటు రామకృష్ణ, బొండపల్లి వెంకటరమణ, అజ్జాడ పరుశురాం, పట్నాన సింహాచలం, అలజంగి సిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేట, తామరకండి, చినభోగిలి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చినభోగిలిలో పంచాయతీ కార్యదర్శి బి.మనోహర్, గ్రామ సర్పంచ్ రాధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్మశాన వాటికకు జంగిల్ క్లియరెన్స్, పైప్ లైయిన్లు దగ్గర పనులు చేపట్టారు. కాశీపేటలో పంచాయతీ కార్యదర్శి పి.మురళి ఆధ్వర్యంలో నీళ్ల ట్యాంకులు శుభ్రం చేసి, పూడికతీత పనులు చేపట్టారు. తామరకండిలో పద్మావతి ఆధ్వర్యంలో కాలువల్లో పూడుకతీతలు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

చినభోగిలిలో పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ రాధాశ్రీనివాస్

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE COURT AT SRIKAKULAM H.M.O.P 61/2024.

Between:-
Bowrubilli @ Burli Pavani Kumari ...Petitioner.
And:-
Bowrubilli Sankararao ...Respondent.
To,
Bowrubilli Sankara rao, S/o Late Pakeeru, aged about 40 years, Private employee, resident of Door No:C 104, Sivalayam Street, Balagudaba village, Parvathipuram mandal, Manyam District.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల దావాలో మీకు నోటీసులు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **తేదీ 12-09-2024 న ఉదయం: గం॥10-30 ని॥** లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

పైడి హర్షవర్ధన్
న్యాయవాది, శ్రీకాకుళం,
సెల్: 9515975111.